సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 25 । జనవరి । 2024



రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యం

రైల్వే కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని రైల్వే జీఎం ఎ.కె.జైన్ అన్నారు.

- 8లో▸



మిరప రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మిరప రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలని భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త మాధవిరెడ్డి అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0° /16.0°

ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి



చిట్యాల: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ చింతల సంధ్యారాణి ఆధ్వర్యంలో అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ప్రతి ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఏఎన్‌ఎం సుమలత, ఆశవర్కర్ మానస, ఆయా లావణ్య, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



భూపాలపల్లి రూరల్: ఇటీవల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేయగా అవి ఎంత వరకు వ్యాధి నిరోధక శక్తి ఉత్పత్తి అయిందని తెలుసుకోవడానికి వైద్యులు బుధవారం మండలంలోని గుడాడ్‌పల్లిలో జీవాల నుంచి రక్త నమూనాలను సేకరించారు. పశు వైద్యశాఖ ల్యాబోరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ నాగమణి జీవాల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు పశువైద్యాధికారి తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉడుత లక్ష్మి- ఐలయ్య, వైద్యాశాల సిబ్బంది శ్రీధర్, పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 172 మంది హాజరు


భూపాలపల్లిరూరల్: వంద పడకల ఆస్పత్రితో బుధవారం నిర్వహించిన సదరం క్యాంపునకు 189 మంది దరఖాస్తులు చేసుకోగా 172 మంది దివ్యాంగులు హాజరయ్యారని డీఆర్‌డీఓ పురుషోత్తం బుధవారం తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశానుసారం వివిధ వైకల్యం కల్గిన దివ్యాంగులకు విడతల వారీగా సదరం క్యాంపులు నిర్వహిస్తామని డీఆర్‌డీఓ తెలిపారు. ఈ క్యాంపులో జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రెగ్యులర్ వార్డెన్లు లేరని, మెనూ అమలు చేయడం లేదని, 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు కూడా నిర్వహించడం లేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కమలాకర్, నరేష్, శ్రీకాంత్, రాజేష్, అభిరామ్, శ్రీకృష్ణలు పాల్గొన్నారు.

వనదేవతలపై పాట చిత్రీకరణ



గోవిందరావుపేట: మండలపరిధిలోని మేడారం సమ్మక్క-సారలమ్మ జీవిత చరిత్రపై రై మ్యూజిక్ వరంగల్ వారు పాటను బుధవారం చిత్రీకరించారు. పాట చిత్రీకరణ చివరి దశకు వచ్చిందని డైరెక్టర్ సుభాష్ సుబ్బు వివరించారు. 20 మంది కళాకారులతో ఈ పాటను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. నటీనటులు వైశాలి, ప్రభాకర్ మాట్లాడుతూ వన దేవతలపై చిత్రీకరించే పాటలో నటించే అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

‘నల్లతామర’ విధ్వంసం

గణనీయంగా తగ్గిన దిగుబడులు

- ఈ ఏడాది సైతం తెగులు వ్యాప్తి
- ఆందోళనలో మిర్చి రైతులు
- జిల్లాలో 24,360 ఎకరాల్లో పంట సాగు



ఈ ఫొటోలోని వ్యక్తి బానోత్ గోపానాయక్. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పుల్లూరు రామయ్యపల్లికి చెందిన రైతు. నాలుగెకరాల్లో మిర్చి సాగు చేశాడు. కాయదశలో తోటకు నల్ల తామర (నల్ల తెగులు) సోకింది. పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట దిగుబడి సగానికి సగం తగ్గిందని, మిర్చి ఏరిన కూలీల డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయాడు. జిల్లా వ్యాప్తంగా మిర్చి రైతుల పరిస్థితి ఇలానే ఉంది.

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని మిర్చి తోటలకు నల్ల తామర తెగుళ్లు సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. గతేడాది 17,774 ఎకరాల్లో సాగు చేయగా ఎండు మిర్చి పంటకు కొంతమేర నష్టం జరిగినా ఉన్న మిర్చికి మార్కెట్‌లో అధిక ధర పలికింది. దీంతో రైతులు పెద్దగా నష్టపోలేదు. ఈ ఏడాది జిల్లాలో 24,360 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. జిల్లాలోని రేగొండ, చిట్యాల, భూపాలపల్లి, గణపురం తదితర ప్రాంతాల్లోని మిర్చి తోటలను నల్ల తెగులు వ్యాప్తి చెందింది. దీంతో మరింత నష్టం జరుగకుండా ఉద్యాన శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నా.. ఫలితం కనబడటంలేదు.

24,360 ఎకరాల్లో సాగు..

మిర్చి సాగుకు జిల్లాకు పెట్టింది పేరు. రైతులు ఈ ఏడాది మిర్చి సాగుపై ఎక్కువగా దృష్టి సారించారు. బోర్లు, బావుల కింద మిర్చిని సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించింది. పంట చేతికి వస్తే పత్తి కన్నా మిరపకి మంచి ధర వస్తుందనే ఉద్దేశ్యంతో రైతులు జిల్లాలో అధికంగా సాగు చేశారు. సరిగ్గా పంటల పూత దశకు వచ్చినప్పుడు నల్ల తెగులు వ్యాప్తి చెందింది. ఇది పంట దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరాకు సాధారణ దిగుబడి 15 నుంచి 18 కింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 5 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుందని రైతులు వాపోతున్నారు. పైగా మిర్చి క్వింటాకు రూ.15వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలుకుతుంది.

నల్ల తెగులుపై నజర్..



గణపురంలో నల్ల తెగులు సోకిన మిర్చి పంట

జిల్లాలో ప్రస్తుతం పంట కాత దశలో ఉంది. ఈ దశలోనే గడిచిన ఏడాది మాదిరిగానే నల్లతెగులు పురుగు ఆశించి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. రైతులు తేరుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే ఈ ఏడాది సైతం నల్ల తామర పురుగు ఆశించడం ప్రారంభమైంది. పురుగు ఉధృతిని అంచనా వేసేందుకు వరంగల్ వ్యవసాయ శాఖ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు మిర్చి తోటలను పరిశీలించారు. నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రూపొందించిన కర పత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు.



తెగులు నివారణకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

తోటకు వెళ్లబుద్ధి కావడంలేదు



రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేయగా పూత దశలో మొక్కలకు నల్లి తెగులు సోకింది. నివారణకు రకరకాల పురుగుల మందులు వాడినా ఫలితం లేదు. తోట పూర్తి స్థాయిలో తెగులు సోకి ఎండిపోయింది. సుమారు రూ. 4 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను.

- ఎల్లబోయిన ఓదెలు, రైతు గణపురం

పురుగు మందులు వాడుతున్నాం..



తోటను ఆలస్యంగా సాగు చేశాను. నల్లి తెగులు వ్యాప్తి చెందుతుంది. అధికారులు పట్టించుకోవడంలేదు. తోటకు గత నెల రోజులనుంచి పురుగు మందులు పిచికారీ చేస్తున్నాం. ఇప్పుడే పూత దశకు వచ్చింది. అధికారులు తోటలను పరిశీలించి నివారణ చర్యలు సూచిస్తే బాగుంటుంది.

- పసరవేన సిద్దులు రైతు, మహబూబ్‌పల్లి

యాజమాన్య పద్ధతులు పాటించాలి..



ఎండు మిర్చి పంటకు నల్లి తెగులు పురుగు ఆశిస్తున్నట్లు గుర్తించాం. దీనిని అధిగమించి పంటకు నష్టం జరుగకుండా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా యాజమాన్య పద్ధతులను తెలియజేస్తున్నాం. రైతులు అధైర్యపడకుండా అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటను కాపాడుకోవాలి.

- సంజీవరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఓటు తీసుకో.. మంచిని ఎంచుకో..




ఉమ్మడి జిల్లాలో ఓటర్ల వివరాలు (06-01-24 నాటికి)

పురుషులు **14,77,078**

మహిళలు **15,16,769**

ఇతరులు : **472**



ఉమ్మడి జిల్లాలో 29,94,319 మంది ఓటర్లు

- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- ఇటీవల ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసిన అధికారులు
- ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ
- పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్నికల కమిషన్
- కొనసాగుతున్న పట్టభద్రుల ఓటర్ల నమోదు
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఒక్క ఓటు.. మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఐదేళ్లపాటు పాలించే నేతల తలరాతలు మారుస్తుంది.. మంచి నేతను ఎన్నుకుంటే మనదారి పూలదారి అవుతుంది.. కానీ ఓటును అమ్ముకుంటే.. మన రాతను మనమే మార్చేసుకున్నట్లే. అందుకే ఓటు.. వజ్రాయుధం అంటారు. ఓటు విలువ వెలకట్టలేనిది. అమూల్యమైనది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ విస్తృత ప్రచారం చేస్తోంది. ఇప్పటికే స్పెషల్ క్యాంపెయిన్లు, అవగాహన సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఓటర్లు, జిల్లా ఎన్నికల అధికారులు ఓటు హక్కు ప్రాధాన్యం, ఓటరుగా నమోదు చేయించడంపై చేపడుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

(వరంగల్ డెస్క్) - 8లో▸



ఓటు కీలకం

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి. జాబితాలో మార్పులు చేర్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఓటును మార్చుకోవాలన్నా, ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరించుకోవచ్చు.

- రాధికా గుప్తా, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్

వైద్యానికే మొదటి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: జిల్లాలో వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని, త్వరలో 100 పడకల ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్‌లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలో పలు ప్రారంభ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం కాసీంపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి గుడి ప్రహరీ ప్రారంభం, అనంతరం బస్ డిపోలో భూపాలపల్లి టు మేడారం, భూపాలపల్లి టు భద్రాచలం రూట్‌లో రెండు నూతన బస్సులను ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. రెడ్ క్రాస్ సంస్థ నిర్మాణం చేపట్టిన సొసైటీ భవన నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అధికవర్షాలకు నియోజకవర్గంలోని 124 చెరువులు తెగిపోయాయని, వాటి మరమ్మతుకు నిధులు కావాలని సీఎంను అడగగానే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వంద పడకల ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దూ, రెడ్ క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ శ్రీనివాసరావు, చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, సభ్యులు డాక్టర్లు కిరణ్, చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి, కృష్ణమోహన్, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, రవీందర్, రజిత, నాయకులు చల్లూరి మధు, వెంకటస్వామి, బుర్ర కొమురయ్య, ప్రసాద్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి దిక్సూచి బాలికలే

సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ జయరాంరెడ్డి



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి: దేశ పురోగతికి దిక్సూచి బాలికలేనని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె.జయరాంరెడ్డి అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికా దినోత్సవ వేడుకలకు జిల్లా సంక్షేమాధికారి నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా సీనియర్ సివిల్ జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలురతో పోటీగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలకు ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన బాలికలకు జడ్జి మెమోంటోలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీడీపీఓలు అవంతి, రాధిక, సెక్టోరియల్ ఆఫీసర్ కిషన్‌రావు, అడ్వకేట్ ప్రియాంక, డీసీపీఓ వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సఖి అడ్మిన్ గాయత్రి, డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ అనూష, తిరుపతి, జయవసంత లక్ష్మి, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేగొండ: బాలికల్లో రక్తహీనత రాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ చల్ల మధుసూదన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారిని హిమబిందు ఆధ్వర్యంలో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 100 మంది పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయగా, 30 శాతం విద్యార్థులు ఎనీమియాతో బాధ పడుతున్నారన్నారు. వారికి ఫోలిక్ యాసిడ్, ఐరన్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ రక్తహీనత తీవ్రత గురించి, దాని వలన కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్ఈఓ శ్రీదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లింగారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుధా, రామస్వామి ఏఎన్‌ఎంలు యాదలక్ష్మి, స్వాతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పరిపాలన వికేంద్రీకరణతోనే మెరుగైన ఫలితాలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: పరిపాలన వికేంద్రీకరణతోనే మెరుగైన ఫలితాలు సాధిస్తామని, ఆ దిశగా మండల స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులను తనిఖీ చేసి వాటి పనితీరు మెరుగుపర్చాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలన వికేంద్రీకరణ ద్వారా మెరుగైన ఫలితాల సాధనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ప్రతీ వారం జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్, ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, వెటర్నరీ హెల్త్ సెంటర్‌లను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలన్నారు. జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తహసీల్దార్లు, పంచాయతీ అధికారులు, ఏపీఓలు, ఏపీఎం, ఎంఏఓలు, ఐకేపి సీసీ, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మొదలగు సిబ్బంది ద్వారా తనిఖీలు నిర్వహించి పనితీరు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 644 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటికి కుర్చీలు, గుడ్లు పెట్టుకునేందుకు ర్యాక్‌లు అందించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సమయంలో తల్లీబిడ్డల ఆరోగ్య అంశాలు, పౌష్టికాహారం పంపిణీ అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. మండల స్థాయిలో చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పన కోసం ప్రతిపాదనలు సమర్పిస్తే కలెక్టరేట్ వద్ద ఉన్న నిధుల నుంచి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దేశంలోనే రేగొండ, గణపురం పీహెచ్‌సీ కేంద్రాలు మంచి పేరు సాధించాయని, ప్రైవేట్, కార్పొరేట్‌కు ధీటుగా వాటిని అభివృద్ధి చేసుకున్నామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లను పరిశీలించే సమయంలో వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్య వారికి అందిస్తున్న సేవలను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

నేడు ఓటరు దినోత్సవం..

జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయ ప్రాంగణంలో నేడు (గురువారం) ఉదయం 10:30 గంటలకు జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన పౌరులు రాజ్యాంగబద్ధంగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజల్లో ఓటుపై అవగాహన కల్పించేందుకు ‘ఓట్ ఫర్ షూర్’ అనే నినాదంతో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఉత్తమ సింగరేణి ఉద్యోగుల ఎంపిక

భూపాలపల్లి అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వర్తిస్తూ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా స్థాయిలో మహమ్మద్ రాజీమహమ్మద్, కాసర్ల శ్రీనివాస్ (కేటీకే 1వ గని), ఈర రవీందర్, కొమురయ్య (కేటీకే-5వ గని), వద్దపల్లి భూమయ్య, మోతుకూరి రాజయ్య (కేటీకే 6వ గని), గుగులోత్ రాజనాయక్, పురేళ్ల శ్రీనివాస్, సోల్లేటి కృష్ణరెడ్డి, బొల్లేని మహేందర్ (ఓసీ-3), గోపతి లచ్చులు, జీ.కుమారస్వామి (ఓసీ-2)లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కంపెనీ స్థాయిలో బెస్ట్ సింగరేణియన్ కావటి రమేష్ (ఓసీ-3), ఉత్తమ అధికారిగా ఓసీ-2 ప్రాజెక్ట్ అధికారి వెంకటరామరెడ్డిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏరియా స్థాయి ఉద్యోగులను ఏరియాలో, సింగరేణి స్థాయి ఉత్తమ ఉద్యోగులను కొత్తగూడెంలో 26వ తేదీన జరిగే వేడుకల్లో అధికారులు సన్మానించనున్నారు.

స్థల పరిశీలన

ములుగు: మండల పరిధిలోని గట్టమ్మ ఆలయ సమీపంలో గిరిజన యూనివర్సిటీకి కేటాయించిన స్థలాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ డాక్టర్ శరత్ బుధవారం పరిశీలించారు. గిరిజన శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్(ఎస్టేట్) అభిషేక్ కుమార్, దేవేష్ నిగమ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తూ కలియతిరిగారు.

భరోసా కేంద్రంలో ఉద్యోగాలు



కిరణ్ ఖరే, జిల్లా ఎస్పీ

భూపాలపల్లి: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రంలో సర్వీస్ రెగ్యూలరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్, ఇద్దరు సపోర్ట్ పర్సన్‌లు, లీగల్ సపోర్ట్ అధికారి, రిసెప్షనిస్ట్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఏఎన్‌ఎం) ఉద్యోగ నియామకాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కౌన్సిలర్ ఉద్యోగానికి రూ.30వేలు, స పోర్ట్ పర్సన్ ఆఫీసర్ ఉద్యోగానికి రూ. 20 వేలు, లీగల్ సపోర్ట్ ఆఫీసర్‌కు రూ. 22వేలు, రిసెప్షనిస్ట్ ఉద్యోగానికి రూ.15వేలు, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ఉద్యోగానికి రూ.16 వేలు గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.ఉమెన్ సేఫ్టీవింగ్. తెలంగాణ. జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు షీ టీమ్/భరోసా సెంటర్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ 87126 58162 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ఎస్పీ కోరారు.

కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రిన్సిపల్ సెక్రటరీని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వరస్వామిని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.శరత్ దర్శించుకున్నారు. బుధవారం ఆయన ఆలయానికి రాగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ మర్యాదపూర్వక స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శుభానందదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఆశీర్వచ వేదిక వద్ద అర్చకుడు బైకుంఠపాండా శాలువాతో సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు కృషి చేయాలి



ఆటోలకు స్టిక్కర్ అతికిస్తున్న ఏఎంవీఐ స్వర్ణలత

ఖిలా వరంగల్ : సామాజిక బాధ్యతగా వాహనం నడిపి ప్రమాదాల నిర్మూలనకు కృషి చేయాలని వరంగల్ ఆర్టీఓ రంగారావు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఎంవీఐలు రమేష్ రాథోడ్, కోల రవీందర్, ఏఎంవీఐలు శాలిని, స్వర్ణలత ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన, ఆటోలకు రోడ్డు భద్రత స్టిక్కర్ల అంటివేత కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఓ రంగారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చన్నారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు శోకం మిగల్చొద్దన్నారు. అతివేగంతో వాహనం నడపడం ప్రమాదాలు తెచ్చుకోవడమేనని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతే చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపొద్దన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ బస్సుల ఓనర్స్ అధ్యక్షుడు స్వరూప్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు ఎండి. ఫసి, లారీ ఓనర్స్ ప్రతినిధులు ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి చేసి చైన్, సెల్‌ఫోన్ అపహరణ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి బాలసముద్రంలోని ఏషియన్‌మాల్ రోడ్డులో ఈనెల 22న రాత్రి 2 గంటల సమయంలో ఓ వ్యక్తిపై గుర్తు తెలియని ఇద్దరు దొంగలు దాడి చేసి రూ.60వేల విలువైన బంగారు గొలుసు, రూ.12 వేల విలువైన సెల్‌ఫోన్ దొంగిలించినట్లు సీఐ షుకూర్ బుధవారం తెలిపారు. హనుమకొండకు చెందిన డేగల అంజనేయ ప్రసాద్ ఈనెల 22న ఖమ్మం నుంచి రాత్రి 2 గంటలకు హనుమకొండకు బస్సులో వచ్చాడు. ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం నిరీక్షించగా, ఏమీ రాకపోవడంతో ఏషియన్‌మాల్ రోడ్డువెంట నడిచి వెళ్తున్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి దాడి చేశారు. మెడలోని చైన్, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బంగారంతో ఉడాయింపు

వరంగల్ క్రైం: హనుమకొండ పీఎస్ పరిధిలోని కొత్తూరు జెండాకు చెందిన చంద్రమౌళి భార్య 100 గ్రాముల బంగారం, కొంత నగదు, ఇతర వస్తువులతో ఉడాయించి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని సీఐ కరుణాకర్ తెలిపారు. చంద్రమౌళికి 10 సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. అక్యుపంక్చర్ వైద్యుడైన చంద్రమౌళి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చే సరికి భార్య బంగారంతో వెళ్లిందని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనపై చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బుధవారం తెలిపారు.

ఓటు విలువ అత్యుత్తమమైంది...



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది. ఇది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. మనకు నచ్చిన ప్రజాప్రతినిధిని, ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు మంచి ఆయుధం వంటిది. ఓటు విలువ తెలిసేలా సందేశాన్ని ఇచ్చే పెయింటింగ్ వేయడం కష్టమైనా వైవిధ్యంగా ఆలోచించి వేశాను.

– నందిని, బీ ఫార్మసీ, సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ

పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది...



ప్రజలను చైతన్యపరిచేందుకు చేపట్టిన పెయింటింగ్ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ పెయింటింగ్ వేయడానికి ఒక్క రోజు మొత్తం సన్నద్ధమయ్యా. నేను సెలక్ట్ చేసుకున్న పెయింటింగ్‌పై స్నేహితులతో చర్చించా. వారు ప్రోత్సహించారు. పెయింటింగ్ అద్భుతంగా వచ్చింది.

– సాహితీ, బీ ఫార్మసీ, సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ

చిత్రాలతో ప్రజల్లో అవగాహన కల్పించడం తృప్తినిచ్చింది...



చిత్రాలతో ఓటు హక్కు విలువపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో తృప్తినిచ్చింది. చిత్రాల ద్వారా అక్షరాస్యులనే కాకుండా నిరక్షరాస్యులను కూడా ఎన్నికలపై అవగాహన కల్పించవచ్చు. ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతో ప్రయోజనకరం.

– శిరిణి, బీఫార్మసీ, సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీ

ఓటు తీసుకో.. మంచిని ఎంచుకో..



- పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్నికల కమిషన్



గోడలపై పెయింటింగ్ వేసి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

ఓటరుగా నమోదు ఎంత కీలకమో.. ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడం అంతే ముఖ్యం. ఐదేళ్లపాటు మనల్ని పాలించే వారిని ఎన్నుకునే సమయంలో దుమ్మా కొడుతున్నారు. ఇది ప్రతీ ఎన్నికల్లో మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పటివరకు ఏ ఎన్నికల్లోనూ వందశాతం పోలింగ్ నమోదైన దాఖలాలు లేవు. దీంతోపాటు 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ అనేక అవగాహన కార్యక్రమాలు, విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ కొందరిలో చలనం రావడం లేదు.

ప్రత్యేక కార్యక్రమాలు..

ఎన్నికల కమిషన్ ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యంపై స్పెషల్ క్యాంపెయిన్లు, ర్యాలీలు నిర్వహిస్తోంది. తాజాగా ఈ నెల 20, 21 తేదీల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహించింది. బుధవారం హనుమకొండలో ఓటరు అవగాహన, భారతదేశంలో ఎన్నికలు (ఓటర్ అవేర్‌నెస్ అండ్ ఎలక్షన్స్ ఇన్ ఇండియా) అనే ఇతివృత్తంపై విద్యార్థులకు వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హనుమకొండ అంబేడ్కర్ సర్కిల్, నక్కలగుట్ట, హనుమకొండ చౌరస్తా ప్రాంతాల్లో వాల్ పెయింటింగ్ వేశారు. ఓటు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు వేసే విధానం, భారత ఎన్నికల విధానం, తదితర వివరాలను తెలిపే విధంగా విద్యార్థులు గోడలపై అందమైన చిత్రాలను చిత్రీకరించారు. ఆ చిత్రాలను అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, ఇతర అధికారులు పరిశీలించారు. ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిమిత్తం ఓటు హక్కు కోసం పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. డిగ్రీ, డిప్లొమా, తత్సమాన విద్యార్హత కలిగిన గ్రాడ్యుయేట్లు.. ఫారం–18 ద్వారా ఓటు హక్కు కోసం ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మండలాల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పట్టభద్రులు తమ విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారితో సంతకం చేసి అందజేయాలని అధికారులు కోరుతున్నారు. ఆ దరఖాస్తులను ఏఈఆర్వోలు ఆధార్ కార్డుతో పాటు విద్యార్హత పత్రాల జిరాక్స్‌లు, గెజిటెడ్ అధికారి సంతకం పరిశీలిస్తారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలతో కలిసి ఏఈఆర్వోలు విచారణ చేసి నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకుంటారు. ఆన్‌లైన్‌లో కూడా వచ్చిన దరఖాస్తులు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ఓటరుగా నమోదు చేస్తారు.

మహిళా ఓటర్లే అధికం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తంగా 29,94,319మంది ఓటర్లు ఉంటే అందులో 14,77,078మంది పురుషులు, 15,16,769మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు 39,691మంది అధికంగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఈ నెల మొదటివారంలో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఈ విషయం స్పష్టమైంది.

ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా (06-01-24)

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
జనగామ	3,69,732	3,74,373	23	7,44,128
మహబూబాబాద్	2,34,453	2,41,418	42	4,75,913
వరంగల్	3,74,312	3,87,556	362	7,62,230
హనుమకొండ	2,50,823	2,59,568	16	5,10,407
జే.ఎస్.భూపాలపల్లి	1,35,900	1,37,744	5	2,73,649
ములుగు	1,11,858	1,16,110	24	2,27,992





ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

మిరప రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త మాధవిరెడ్డి



మిరప రకాలపై క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్ : మిరప రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలని బెంగుళూరు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కే.మాధవిరెడ్డి అన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ఉప ప్రణాళిక సౌజన్యంతో మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో బెంగళూరు భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం మిరప సాగులో మెరుగైన వ్యవసాయ పద్ధతులపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం అభివృద్ధి చేసిన ఆర్కాతన్వి, ఆర్కాయశస్వి, ఆర్కాతేజస్వి, ఆర్కాగగన్, ఆర్కాశాన్వి అనే మిరప రకాలను క్షేత్ర ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా రైతులకు నేరుగా మిరప తోట వద్దే క్షేత్రస్థాయిలో మిర్చి దిగుబడి గురించి చూపించి వివరించారు. ఈ రకాలు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందే చిల్లి లీఫ్ కర్ల్ వైరస్ను తట్టుకుంటాయని మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి కె.భాస్కర్ తెలిపారు. అందుకే ఇలాంటి రకాలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని మాధవిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు పొన్నం నరేష్, అతీకుల్లా, మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.లక్ష్మీనారాయణ, ఉద్యాన అధికారి ఏ.విష్ణు, రైతులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్‌కు 3 రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 26 నుంచి 28వ తేదీవరకు మూడు రోజులు సెలువు ఉందని, ఈ సమయంలో మార్కెట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 26 గణతంత్ర దినోత్సవం, 27 వారంతపు యార్డు బంద్, 28వ తేదీన వారంతపు సెలవు ఉన్న నేపథ్యంలో వరుసగా మూడు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు గుర్తించాలన్నారు. 29వ తేదీ మార్కెట్ ప్రారంభం అవుతుందన్నారు. 27వ తేదీన జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు జరపదని తెలిపారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

- నీటి సంపులో పడి చిన్నారి మృతి
- చలపర్తి గ్రామంలో ఘటన
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



దిత్రిక (ఫైల్)



చిన్నారిని బలిగొన్న నీటి సంపు

దుగ్గొండి : అప్పటి వరకు బుడిబుడి అడుగులు వేస్తూ తల్లి ఎదుటే ఆడుకున్న ఆ చిన్నారి క్షణకాలంలో కనిపించని లోకాలకు వెళ్లింది. తన చెల్లి ఏడుస్తుండడంతో తల్లి ఇంట్లోకి వెళ్లింది. ఈ సమయంలో తల్లిబిడ్డను వేరు చేసిన మృత్యువు..నీటి సంపు రూపంలో ఆ చిట్టి తల్లిని బలితీసుకుంది. ఈ ఘటన బుధవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చలపర్తి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గుండె బోయిన జగదీశ్వర్, కీర్తన దంపతులకు 27 నెలల దిత్రిక, 3 నెలల మరోపాప ఉంది. వృత్తిలో భాగంగా జగదీశ్వర్ ఉదయం కల్లు గీయడానికి తాటి వనానికి వెళ్లాడు. కీర్తన తన ఇద్దరు పాపలతో ఇంటి వద్దనే ఉంది. ఉదయం వేళ దిత్రిక ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కీర్తన చూస్తూ కూర్చుంది. ఇంతలో లోపల మూడు నెలల పాప ఏడుస్తుండడంతో కీర్తన పాప వద్దకు వెళ్లింది. మళ్లీ వచ్చి చూడగా దిత్రిక కనిపించలేదు. వెతకగా నీటి సంపులో పడి ఉంది. వెంటనే పాపను బయటికి తీసి నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. దీంతో చిన్నారి మృతదేహం వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై జగదీశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యం

- రైల్వే జీఎం ఎ.కె.జైన్
- రైల్వే ఆసుపత్రి ప్రారంభం



రైల్వే ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం జైన్

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికులు, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం కోసం కృషి చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ (ఎ.కె) జైన్ అన్నారు. ఇటీవల నిర్మించిన కాజీపేట రైల్వే ఆసుపత్రిని బుధవారం సికింద్రాబాద్ డీఆర్ఎం భర్తేష్‌కుమార్ జైన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన రైల్వే పాలిక్లినిక్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, నూతన ఆసుపత్రిని త్వరలో అప్‌గ్రేడ్ చేసి విస్తరించనున్నట్లు తెలిపారు. రూ.20 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో అన్ని హంగులతో కాజీపేట జంక్షన్‌ను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు, కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కార్యాలయాలు, వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాంలు, సర్క్యులేటింగ్ ఏరియాను రీ–డెవలప్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైల్వే ఆసుపత్రిలో నిర్మించిన మేల్, ఫిమేల్ వార్డులు, డ్యూటీ డాక్టర్స్ రూం, ఇతర గదులను తనిఖీ చేసి అధికారులతో కాజీపేట రైల్వే డివిజన్, కాజీపేట జంక్షన్ అభివృద్ధిపై చర్చించినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం జీఎం పీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, పీసీఎండీ వెంకటేశ్వర్లు, సీఎంఎస్ డాక్టర్ అనురాధ, సీనియర్ డీఎస్‌టీఈ అగర్వాల్, సీనియర్ డీఈఈ టీఆర్‌డీ వాసింపాషా, సీనియర్ డీఓఎం సురేష్‌రెడ్డి, డీఈఎన్ ప్రంజల్, సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్, రైల్వే డాక్టర్లు ఐ.నిరంజన్‌రావు, నరేందర్ హిర్వానీ, హరిబాబు, రాజేందర్, ధీరజ్, యాకూబ్, వెల్ఫేర్ ఇన్స్‌పెక్టర్ సంధ్య, ఛీఫ్ ఫార్మసిస్ట్‌లు చింత తిరుపతి, వి. హరీష్, తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు రైల్వే నాయకుల సన్మానం

రైల్వే జీఎం ఎ.కె.జైన్‌కు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, డి.శ్రీనివాస్‌యాదవ్, నాయిని సదానందం, సమ్మయ్య, జానీ ఆధ్వర్యంలో, రైల్వే సంఘ్ నాయకులు ఎస్.వెంకటనారాయణ,ముస్తాక్, మధుసూదన్, యాకూబ్‌పాషా, దుప్పటి రాజేందర్, మాధవ్ ఆధ్వర్యంలో, రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, రాజయ్య, రాజేశ్వర్, ప్రశాంత్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. కాజీపేటలో సబ్ డివిజన్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.

కాజీపేట జంక్షన్‌లో జీఎం తనిఖీ

సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న జీఎం జైన్.. ముందు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఎదుట సర్క్యులేటింగ్ ఏరియాలో చేపడుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి చేపట్టనున్న అధికారులతో మాట్లాడారు. అనంతరం రైల్వే జీఎం డీజిల్‌షెడ్ వద్ద గల కోచింగ్ డిపో ఫిట్‌లైన్ వద్దకు వెళ్లి అక్కడ తనిఖీ చేశారు.

200 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ అధికారులు



తొర్రూరు: గంజాయి వివరాలు వెల్లడిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు

తొర్రూరు: భారీ స్థాయిలో 200 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ ఘటన ఘటన తొర్రూరు డివిజన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం డివిజన్ కేంద్రంలోని స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు కథనం ప్రకారం.. ఏపీలోని నంద్యాల జిల్లా సిద్దాపురం గ్రామానికి చెందిన కుంచల జయచంద్ర.. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఎండు గంజాయిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. కాగా, రంపచోడవరం నుంచి 200 కిలోల గంజాయిని కారులో తరలిస్తున్న క్రమంలో వాహనం తొర్రూరు వైపునకు వస్తుండగా నెల్లికుదురు సమీపంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ బి. కృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు వెంబడించారు. వీరిని గమనించిన జయచంద్ర కారును ఇతర మార్గంలోకి వేగంగా మళ్లించే క్రమంలో వాహనం నెల్లికుదురు మండలం బంజర గ్రామ సమీపంలో బోల్తాపడింది. ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకుని ఎండు గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. వాటిని తూకం వేయగా 200 కిలోల బరువు ఉందని, దీని విలువ రూ.40 లక్షల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. అనంతరం జయచంద్రను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ భాస్కర్ రావు, ఎస్సైలు హరీష్, రవళి పాల్గొన్నారు.

రేగొండలో ముగ్గురి అరెస్టు..

రేగొండ: ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను భూపాలపల్లి సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రేగొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సీఐ పులి వెంకట్, రేగొండ ఎస్సై రవికుమార్ మండలంలోని తిరుమలగిరి ఆర్చ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద రెండు ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఒక్కో ప్యాకెట్‌లో 1.5 కిలోల చొప్పున మొత్తం 3 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకుని పోలీస్ కానిస్టేబుల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బంజారా గ్రామానికి చెందిన పోడియం రమేష్, ఆటో డ్రైవర్లు జంగాల కాలనీకి చెందిన ఉప్పు సాయి, ఎస్సార్ కాలనీకి చెందిన కణతి రమణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సీఐ పులి వెంకట్, రేగొండ ఎస్సై రవికుమార్ తెలిపారు.

అండర్‌బ్రిడ్జి వద్ద ఎండు గంజాయి స్వాధీనం..

కాజీపేట అర్బన్ : స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ అధికారుల సంయుక్త దాడుల్లో 20.85 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లింగయ్య తెలిపారు. బుధవారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద గల ఆటోస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనుమానాస్పద స్థితిలో కనిపించిన ఒడిశాలోని గణపతి జిల్లాకు చెందిన సామ్యుల్ పలాట సింగ్‌ను తనిఖీ చేయగా 20.85 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడి ఖమ్మం జైలుకు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్టీఎఫ్ సీఐ వెంకట్రాంరెడ్డి, మురళి, ఎస్సై జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ..

- ఇద్దరి మృతి..నలుగురికి గాయాలు
- నల్లగట్టుగుట్ట సమీపంలో ఘటన



రజిత (ఫైల్)



శివశంకర్ (ఫైల్)

హసన్‌పర్తి : హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగళవారం అర్ధరాత్రి బైక్, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా నలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ మండలం గుండ్లసింగారానికి చెందిన భూక్య రజితతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి ఈనెల 22వ తేదీన ఆటోలో వేములవాడకు వెళ్లారు. దర్శనం అనంతరం మంగళవారం ఇంటికి పయమనమయ్యారు. అయితే హసన్‌పర్తి నల్లగట్టుగుట్ట సమీపంలోకి చేరగానే బైక్ రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భూక్య రజిత(35), బైక్‌పై ప్రయాణిస్తున్న హసన్‌పర్తికి చెందిన కాటం శివశంకర్(30) మృతి చెందారు. అలాగే, బైక్ డ్రైవింగ్ చేస్తున్న పాలకుర్తికి చెందిన చిట్యాల సంపత్, ఆటోలో ప్రయాణిస్తున్న దుర్గతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అతివేగంగా వాహనం నడిపి తన భార్య మృతికి కారణమైన చిట్యాల సంపత్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త శ్రీను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

యశ్వంత్ మరిన్ని విజయాలు సాధించాలి



ఏసీబీ డీజీ ఆనంద్‌కు ఆల్బమ్ అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: పిన్న వయసులోనే భూక్య యశ్వంత్ అనేక ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్వత శ్రేణులు అధిరోహించారని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఏసీబీ డీజీ ఆనంద్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్య తండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటెయినర్ భూక్య యశ్వంత్ బుధవారం హైదరాబాద్‌లో ఏసీబీ డీజీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పర్వతశ్రేణులను అధిరోహించిన ఆల్బమ్‌ను డీజీకి అందజేశారు. డీజీ ఆనంద్ మాట్లాడుతూ యశ్వంత్ ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తైన కోస్కియుస్కో పర్వతాన్ని అధిరోహించి శిఖరంపై జాతీయ పతకం ఎగరవేయడం గొప్ప విషయమన్నారు. త్వరలో ప్రసిద్ధిగాంచిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు యశ్వంత్.. డీజీకి వివరించారు.